నమస్తే తెలంగాణ
మహబూబాబాద్
5 | వరంగల్, శుక్రవారం 23 ఆగస్టు 2024 | MAHABUBABAD


వర్ధన్నపేట: ధర్నాలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, చిత్రంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి

చిల్పూరు: మల్కాపూర్‌లో ధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య


మరిపెడ: మున్సిపల్ కేంద్రంలో ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతున్న డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్

జనగామలో ప్లకార్డును ప్రదర్శిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, పక్కన ఎమ్మెల్యే పల్లా, తదితరులు

నర్సంపేట: తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

రుణమాఫీ కోసం రైతులు గర్జించారు. అందరికీ మాఫీ చేస్తామని చెప్పి దగాచేసిన కాంగ్రెస్ సర్కారుపై కన్నెర్రజేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుతో అన్నదాతలకు మద్దతుగా గురువారం ఉమ్మడి జిల్లా అంతటా ధర్నాలు నిర్వహించగా ప్రజాప్రతినిధులు, నాయకులు, శ్రేణులతో కలిసి నిరసనలతో హోరెత్తించారు. మొదటి విడుత నుంచి కోతలు, ఎగవేతలు, రోజుకో తీరు ప్రకటనలతో ఆగం చేస్తూ బ్యాంకులు, వ్యవసాయ శాఖ కార్యాలయాలు, రైతు వేదికల చుట్టూ తిప్పుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్ మోసపూరిత వైఖరిపై భగ్గుమన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ, మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ నాయకులు, రైతులు బైఠాయించగా రేవంత్ డౌన్ డౌన్ నినాదాలు మిన్నంటాయి. 'కాంగ్రెస్ నాటకం.. రుణమాఫీ బూటకం'.. 'కాంగ్రెస్ చేతిలో దగాపడ్డ రైతన్న' అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. బీఆర్ఎస్ ధర్నాలతో అన్ని జిల్లాలు దద్దరిల్లగా షరతులు లేకుండా అర్హులందరికీ పంట రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

- నమస్తే నెట్‌వర్క్, ఆగస్టు 22

బీఆర్ఎస్ ధర్నాలతో దద్దరిల్లిన ఉమ్మడి జిల్లా

- అన్నదాతల కోసం సర్కారుపై పోరు
- దగా కాంగ్రెస్‌పై భగ్గుమన్న అన్నదాతలు
- నిరసనలతో హోరెత్తిన మండలకేంద్రాలు
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు, శ్రేణులు
- మిన్నంటిన సీఎం రేవంత్ డౌన్ డౌన్ నినాదాలు
- అందరికీ మాఫీ చేయాల్సిందేనని డిమాండ్

రైతుగర్జన
మాఫీ చేయని కాంగ్రెస్‌పై కన్నెర్ర


ఏకశిల పార్క్ వద్ద ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, రైతులు, పార్టీ కార్యకర్తలు

ములుగు కలెక్టరేట్ ఎదుట ఆందోళనలో పాల్గొన్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ నాగజ్యోతి, బీఆర్ఎస్ నాయకులు

జనగామ జిల్లాకేంద్రంలో తలపెట్టిన ధర్నాలో మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, బీఆర్ఎస్ రాష్ట్ర నేతలు దేవీప్రసాద్, రాకేశ్‌రెడ్డి పాల్గొని నిరసన తెలిపారు. అలాగే తొర్రూరు, వర్ధన్నపేట, రాయపర్తి మండలకేంద్రాల్లో రాస్తారోకోలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. మహబూబాబాద్‌లో మాజీ మంత్రి సత్యవతిరాథోడ్, మాజీ ఎంపీ, జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ పాల్గొనగా బయ్యారంలో మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, మరిపెడలో మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ పాల్గొన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూర్‌లో మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల, రేగొండ మండలాల్లో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు ఎదుట బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, పరకాల, గీసుగొండ మండలం ఊకల్ సొసైటీ ఎదుట మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, భీమదేవరపల్లి, ఎల్కతుర్తిలో మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్, వరంగల్ పోస్టాఫీస్ సెంటర్‌లో మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పాల్గొని రైతుకు ఆంక్షలు లేకుండా రుణమాఫీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

కొర్రీలతో కాంగ్రెస్ మోసం

- ఇప్పటివరకు 25 శాతం మందికే మాఫీ
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- హామీలు అమలయ్యే వరకూ ఆందోళనలు ఆగవు
- ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి
- వర్ధన్నపేట, రాయపర్తిలో ధర్నా

వర్ధన్నపేట/రాయపర్తి, ఆగస్టు 22 : పంట రుణాలను రూ.2లక్షల వరకు ఏకకాలంలో మాఫీ చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కొర్రీలతో రైతులను మోసం చేస్తున్నదని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ రాష్ట్రవ్యాప్త ధర్నాలో భాగంగా గురువారం వర్ధన్నపేట లోని అంబేద్కర్ సెంటర్, రాయపర్తిలోని వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై ధర్నా చేశారు. రాయపర్తి తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పాల్గొన్న ఎర్రబెల్లి మాట్లాడారు. రాష్ట్రంలో 25 శాతం మంది రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగిందని పేర్కొన్నారు. ఇంకా 75 శాతం మంది రైతులకు మాఫీ కావాల్సి ఉందన్నారు. పంట రుణమాఫీ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఉసురు పోసుకుంటోందని విమర్శించారు. ఇప్పటికీ రైతులకు రైతుబంధు డబ్బులు జమ చేయలేదని, సాగు జలాలను అందించలేదని, ప్రతిపక్షాలను విమర్శించడమే రేవంత్ సర్కారు ప్రధాన ఎజెండాగా పెట్టుకున్నదన్నారు. రుణమాఫీ చేస్తామని ఎన్నికల సమయంలో దేవుళ్లపై ఒట్లు వేసిన రేవంత్‌రెడ్డి రైతులను మోసం చేశాడన్నారు. మాఫీ కాని రైతులు మనోవేదనకు గురవుతున్నారని, పూర్తిగా మాఫీ చేసేవరకూ బీఆర్ఎస్ ఆందోళన చేస్తుందన్నారు. రాయపర్తిలో దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

మాటలతో కాలం వెళ్లదీస్తున్న ప్రభుత్వం : ఎమ్మెల్సీ పోచంపల్లి

ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారెంటీలు అమలు చేయకుండా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు మాటలతోనే కాలం వెళ్లదీస్తున్నారు. అధికారం కోసం ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు ఎన్నో చెప్పారని అధికారంలోకి వచ్చాక ఏ ఒక్క హామీనీ పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదు. ముఖ్యంగా పంట రుణాలను రూ.2 లక్షల వరకు ఎలాంటి షరతులు లేకుండా మాఫీ చేయాల్సి ఉండగా, అర్థంలేని కారణాలతో మాఫీ చేయడం లేదు. కాగా, ఎర్రబెల్లి ఇల్లందలోని యూనియన్ బ్యాంకు, కాకతీయ గ్రామీణ వికాస బ్యాంకును సందర్శించారు. రైతు రుణమాఫీపై రైతులతోపాటుగా బ్యాంకుల మేనేజర్లతో మాట్లాడారు. అర్హులైన రైతులకు కూడా మాఫీ కాకపోవడంపై అడిగారు. తమకు రేషన్‌కార్డు లేదని, బ్యాంకుల్లో సాంకేతిక లోపాలతో రుణమాఫీ జరగలేదని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారని పలువురు రైతులు వాపోయారు. బ్యాంకు అధికారులతో మాట్లాడిన అనంతరం రైతులకు ధైర్యం చెప్పి బీఆర్ఎస్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో ధర్నా చేస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి

బయ్యారం: ప్లకార్డులతో ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియ

మంగపేట: రహదారిపై ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఎల్కతుర్తి: నిరసన సభలో మాట్లాడుతున్న హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

మాఫీ చేసేదాకా పోరాటం

- రైతు ద్రోహి రేవంత్
- ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ కవిత
- మానుకోటలో బీఆర్ఎస్ ధర్నా

మహబూబాబాద్‌లో ధర్నా చేస్తున్న మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ కవిత, మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్

మహబూబాబాద్, ఆగస్టు 22(నమస్తే తెలంగాణ) : సీఎం రేవంత్‌రెడ్డి రైతుద్రోహి రైతు అని ఎన్నికల ముందు అందరికీ రుణమాఫీ చేస్తానని చెప్పి, ఇప్పుడు అనేక కొర్రీలు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్న తీరును రైతులు గమనించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ అన్నారు. ధర్నాలో భాగంగా గురువారం మహబూబాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట మాజీ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవితతో కలిసి ఆమె నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ కోసం రూ.45వేల కోట్లు అవుతుందని ముందు అంచనా వేసి బడ్జెట్లో కేవలం రూ.26వేల కోట్లు పెట్టారని, ఇప్పుడు రైతు రుణమాఫీ కింద కేవలం రూ.17వేల కోట్లే మాఫీ చేయడమేమిటని ప్రశ్నించారు. ఆధార్ కార్డులో తప్పు ఉందని, రేషన్ కార్డు, ఇంటికి ఒకటి, ఐటీ, ప్రభుత్వ ఉద్యోగం ఉన్న వారికి ఇవ్వబోమని ఇలా రకరకాల కొర్రీలు పెట్టి చాలామంది రైతులకు రుణమాఫీ చేయడం లేదని మండిపడ్డారు. ప్రతి రైతుకు రుణమాఫీ అయ్యేవరకు బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని స్పష్టంచేశారు. కేసీఆర్ పాలనలో కేవలం 10 ఏళ్లలో రైతులకు లక్ష కోట్ల వరకు ఇచ్చామని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులందరికీ వెంటనే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

రైతులకు క్షమాపణ చెప్పాలి : కవిత

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని మాలోత్ కవిత డిమాండ్ చేశారు. అధికారంలోకి రాకముందు అందరికీ రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి ఇప్పుడు ఎగవేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోని మంత్రులు తలో మాట మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ఒక మంత్రి రూ.17 వేల కోట్లు అని, మరో మంత్రి సగం రుణమాఫీ అయిందని, ఇంకో మంత్రి పూర్తిగా రుణమాఫీ చేశామని ఇలా ఎవరికి తోచింది వారు ప్రకటనలు చేస్తూ రైతులను మోసం చేస్తున్నారు తప్ప వాస్తవాలను రైతులకు చెప్పడం లేదని ఆమె విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తానని చెప్పి ఇప్పటివరకు చేయలేదన్న విషయం రైతులు గమనించాలని కోరారు. ఒక గ్రామంలో 300 మంది రైతులు ఉంటే కేవలం 30మందికే మాఫీ అయ్యిందని కవిత గుర్తుచేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం షరతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేసి తీరాలని, లేకపోతే మరిన్ని ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్, మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మారినేని వెంకన్న, రాష్ట్ర నాయకులు భరత్ కుమార్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, శీను, అశోక్ పాల్గొన్నారు.

పరకాల: అంబేద్కర్ సెంటర్‌లో ధర్నాలో మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, పార్టీ నాయకులు

రేగొండ: పరకాల- భూపాలపల్లి జాతీయ రహదారిపై ధర్నాలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

దేవుళ్లపై ఒట్టేసి రేవంత్ దగా

- రుణమాఫీపై కాంగ్రెస్ నిజ స్వరూపం బయటపడ్డది
- వందశాతం రైతు రుణమాఫీ అయ్యిందా?
- ఏ ఊరికొస్తావో చెప్పు.. కాలేదని నిరూపిస్తాం
- జనగామ రైతు ధర్నాలో మాజీ మంత్రి హరీశ్‌రావు

జనగామ, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్ల మీద ఒట్టు పెట్టి పంద్రాగస్టు లోపు రూ. రెండు లక్షలు మాఫీ చేస్తామని చెప్పి ఇప్పుడు ప్రజలను దగా చేశాడని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ధ్వజమెత్తారు. షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం జనగామ జిల్లాకేంద్రంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రైతు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. గులాబీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరై తొలుత తెలంగాణ తల్లి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేసి, ప్లకార్డులతో నిరసన చేపట్టారు. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు దేవీప్రసాద్, క్యామ మల్లేశం, రాకేశ్‌రెడ్డితో కలిసి ధర్నాలో పాల్గొని హరీశ్‌రావు మాట్లాడారు. వందశాతం రైతు రుణమాఫీ అయ్యిందా? ఏ ఊరికొస్తావో చెప్పు.. ఏ మండలానికి వస్తావో చెప్పు..కాలేదని మేం నిరూపిస్తాం అని సవాల్ చేశారు. మంత్రులు తలో మాట మాట్లాడుతున్నారని, ఎవరి మాట నమ్మాలో తెలియక ప్రజలు ఆందోళన చెందుతున్నారని హరీశ్‌రావు అన్నారు. రుణమాఫీ విషయంలో దేవుడిపై ఒట్టు పెట్టి ప్రజలను మోసం చేశానని తప్పు ఒప్పుకొని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాపపరిహారం చేయాలని అన్నారు. రేవంత్ బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని, ఎనిమిది నెలల వడ్డీతో సహా పూర్తి రుణమాఫీ అమలు చేసేలా ప్రభుత్వం మెడలు వంచుతామని హరీశ్‌రావు స్పష్టం చేశారు. 11 విడత ల్లో రూ. 70వేల కోట్లు రైతు బంధు ఇచ్చి రైతును రాజును చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. ఏ ఒక్క హామీ అమలు చేయకుండా ప్రజలను మోసం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం అని మండిపడ్డారు. మా కార్యకర్తలను ఎక్కడ ఇబ్బంది పెట్టినా, భవిష్యత్తులో మూల్యం చెల్లించక తప్పదని, పోలీసు అధికారులు జాగ్రత్త అంటూ హరీశ్ హెచ్చరించారు. పంటలకు బోనస్ అని బోగస్ చేశారని, రుణమాఫీని బొగ్గుబాయి కార్మికులకు, ఆర్టీసీ ఉద్యోగులకు వర్తింపజేయడం లేదని.. ఐటీ నిబంధనలని ఆశ వర్కర్లు, ఆంగన్‌వాడీలకు కోతలు పెట్టారని మండిపడ్డారు. కేసీఆర్ వ్యవసాయాన్ని పండుగ చేస్తే రేవంత్ సర్కారు నిర్వీర్యం చేస్తున్నదన్నారు. ధర్నాలో మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, వైస్ చైర్మన్ మేకల రాంప్రసాద్, మార్కెట్ మాజీ చైర్మన్ బాల్దె సిద్ధిలింగం, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గాడిపెల్లి ప్రేమలతారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఇర్రి రమణారెడ్డి, గద్ద నర్సింగరావు పాల్గొన్నారు.

సర్కారు మెడలు వంచుతం : ఎమ్మెల్యే పల్లా

అర్హులందరికీ రుణమాఫీ అందేలా సర్కారు మెడలు వంచుతాం. జనగామలో రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని మార్కెట్‌కు వెళ్లి నిలదీసి మద్దతు ధర కోసం కొట్లాడాం. అదే స్ఫూర్తితో రైతు రుణమాఫీలో కూడా న్యాయం జరిగే వరకు వెంట ఉంటాం. పాక్షికంగా రుణమాఫీ పథకం అమలు చేసి సంపూర్ణమంటూ రేవంత్‌రెడ్డి దొంగమాటలు చెప్పాడు. డిసెంబర్‌లో చేయాల్సిన రుణమాఫీ ఆలస్యం చేసి వడ్డీ చెల్లించలేదని వేలాది మంది రైతులకు రుణమాఫీ చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది. రుణాలను మాఫీ చేసి వెంట నే కొత్త రుణాలు ఇవ్వాలి. అన్ని రకాల పంటలకు బోనస్ ఇవ్వాలి. రైతు భరోసా నిధులను విడుదల చేయాలి. చిన్నచిన్న సాంకేతిక కారణాలను సాకుగా చూపి రుణమాఫీ నుంచి తప్పించుకోవాలని చూస్తున్నది.

వరంగల్ చౌరస్తా: రోడ్డుపై బైఠాయించి ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నన్నపునేని, పార్టీ శ్రేణులు

రేవంత్ ఆటలు సాగనివ్వం : ఎమ్మెల్సీ దేశపతి

ముఖ్యమంత్రి మాయమాటలు.. దేవుళ్లపై ఒట్లు పెట్టుకొని చేసిన దగాను రైతులు, ప్రజలు గమనిస్తున్నారు. ఇకపై ఎంత మాత్రం ఆయన ఆటలు సాగవు. ఇందిరమ్మ రాజ్యం..ప్రజాపాలనలో మాట్లాడే హక్కును కాంగ్రెస్ హరిస్తున్నది. ప్రజల తరపున బీఆర్ఎస్ ప్రశ్నించి అండగా నిలుస్తుంది. రుణమాఫీ పూర్తిస్థాయిలో చేయలేదనే దానికి మంత్రులు ప్రకటనలే నిదర్శనం. 49 లక్షల మందికి చేయాల్సిన రుణమాఫీ 22 లక్షల మంది రైతులకు మాత్ర మే అయిందని ఒప్పుకున్నది నిజం కాదా?